

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6:28	5:11
నంద్యాల	6:27	5:10



పరీక్షా కేంద్రం వద్ద భద్రతపై డీఈవోతో చర్చిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తనిఖీ చేశారు. నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్ చేరుకొని పరీక్షా కేంద్రం వద్ద భద్రతను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి ఏ విధమైన పరికరాలను లోపలకు అనుమతించేది ఉండదని చెప్పారు. పరీక్షా కేంద్రాల చుట్టూ ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్‌లు పరీక్షలు ముగిసే వరకు తెరవడానికి వీలు లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండకూడదని హెచ్చరించారు. విద్యార్థులు, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మినహా ఇతరులను ఎవ్వరినీ లోపలకు అనుమతించబోమన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతోపాటు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



పకడ్బందీగా

- 394 మంది విద్యార్థుల గైర్హాజర్
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన స్టేట్ అబ్జర్వర్

పది పరీక్షలు








కేటాయించిన గదిని చూసుకుంటూ..

నంద్యాలలో పరీక్షలు రాసేందుకు సిద్ధమైన విద్యార్థులు



ఉయ్యాలవాడ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు



నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 130 పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 24,907 మంది విద్యార్థులకుగాను 24,513 మంది విద్యార్థులు హాజరు కాగా 394 మంది గైర్హాజరయ్యారు. రాష్ట్ర అబ్జర్వర్ ఎస్ అబ్రహం జిల్లాలోని ఆళ్లగడ్డ, శిరువెళ్ల, నంద్యాల ప్రాంతాల్లోని 20 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి రోజు పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించామ న్నారు. జిల్లా వ్యాప్తం గా ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 15 పరీక్షా కేంద్రాలను పరిశీలించాయని చెప్పారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో ఆరుగు రు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నా మన్నారు. సార్వ త్రిక విద్యా పీఠం పరీక్షల్లో భాగంగా మొదటి రోజు హిందీ పరీక్ష నిర్వహించామని, 9 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 21 మంది విద్యార్థులకుగాను 16 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు.



చర్చించుకుంటున్న డీసీఎంఈ హరినాథ్‌బాబు, డిపో మేనేజర్ గంగాధర్

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం

ఆర్టీసీ డీసీఎంఈ హరినాథ్ బాబు

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీకుంటున్నామని ఆర్టీసీ డీసీఎంఈ హరినాథ్ బాబు అన్నారు. సోమవారం ఆయన నంద్యాల ఆర్టీసీ డిపో గ్యారేజిని సందర్శించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ గంగాధర్‌తో గ్యారేజి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. డీసీఎంఈ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారి కోసం బస్సులను అందుబాటులో ఉంచటంతోపాటు వాటి కండిషన్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతానికి నంద్యాల డిపో పది బస్సుల ద్వారా విద్యార్థులకు సేవలు అందిస్తోందన్నారు. డిపో మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ తమ హాస్టల్లో చదువుతూ పరీక్షలు రాస్తున్న వారి కోసం రెండు బస్సులు కావాలని బీసీ సంక్షేమ శాఖ కోరిందని అన్నారు. ఈ మేరకు బస్సులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.



చాగలమర్రిలో పరీక్ష కేంద్రానికి తల్లిదండ్రుల సహాయంతో వెళ్తున్న దివ్యాంగ విద్యార్థులు



మల్లంపల్లె నుంచి పరీక్ష కేంద్రానికి పోలీసు వాహనంలో వెళ్తున్న విద్యార్థులు

పది విద్యార్థులకు పోలీసుల వాహనాల ఏర్పాటు

డోన్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపల్లె, బొంతిరాళ్ల, లక్ష్మింపల్లె, దొరపల్లె గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో డోన్ రూరల్ పోలీసులు స్పందించారు. రూరల్ సీఐ రాకేష్‌బాబు ఆధ్వర్యంలో మూడు సొంత వాహనాలను ఏర్పాటు చేసి మల్లెంపల్లె గ్రామం మీదుగా పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 36 మంది విద్యార్థులకు డోన్ పట్టణంలోని పరీక్ష కేంద్రం వద్దకు పోలీసు వాహనాల ద్వారా తరలించారు. విద్యార్థులు పరీక్ష రాసిన అనంతరం తిరిగి వారి గ్రామాలకు పోలీసులు వాహనాల ద్వారా తరలించారు. దీంతో మల్లంపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇబ్రహీం, డోన్ రూరల్ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్విజిలేటర్ తొలగింపు

చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారికి షోకాజ్ నోటీస్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థికి ఒక సెట్ ప్రశ్నపత్రం కాకుండా మరో సెట్ ఇచ్చి పరీక్ష నిర్వహించడంపై జిల్లా విద్యాశాఖాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి రిలీవ్ చేయడంతో పాటు పర్యవేక్షణ అధికారులైన సీఎస్, డీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కామేశ్వరి అనే స్కూల్ అసిస్టెంట్‌ను అక్కడే ఇన్విజిలేటర్‌గా నియమించారు. సోమవారం ఒక విద్యార్థికి 01టి (తెలుగు) ప్రశ్నపత్రానికి బదులుగా 03టి(సంస్కృతం) ప్రశ్నపత్రం ఇచ్చి పరీక్ష రాయించారు. ఈ విషయంలో కౌంటింగ్‌లో బయటపడడంతో జిల్లా విద్యాశాఖాధికారులు వెంటనే ఆ ఉపాధ్యాయురాలిని విధుల నుంచి రిలీవ్ చేసి శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. అలాగే అక్కడే విధులు నిర్వహిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారికి షోకాజు నోటీస్ జారీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పొరపాటు మరెక్కడా జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర అబ్జర్వర్ అబ్రహాంతో పాటు ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బాధితుల సమస్య వింటున్న ఎస్‌డీపీవో

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 72 వినతులు

నంద్యాల క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని నంద్యాల ఎస్‌డీపీవో మందా జావలి ఆల్ఫోన్స్ అన్నారు. సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయని ఆమె తెలిపారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హాజరు కాలేని ప్రజలు సమీపంలోని పోలీసుస్టేషన్లు సర్కిల్, డీఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందించవచ్చని ఆమె చెప్పారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు తదితర ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

ఐదేళ్లవుతున్నా పింఛన్ లేదు



బాధితురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

- కలెక్టర్‌కు విన్నవించుకున్న బాధితురాలు
- వితంతువు పీజీఆర్ఎస్‌లో 209 దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెంది ఐదేళ్లవుతున్నా ఇప్పటి వరకు వితంతు పింఛన్ మంజూరు కాలేదని ఆళ్లగడ్డ మండల కేంద్రానికి చెందిన మహేశ్వరమ్మ వాపోయింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ ఆళ్లగడ్డ తహసీల్దార్‌తో మాట్లాడి బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్వో రాము నాయక్‌లు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు 209 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఇప్పటి వరకు 30,058 దరఖాస్తులకు గాను 27854 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. సంబంధిత అర్జీదారుల నుంచి అభిప్రాయాలను సేకరించాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వే వివరాలను సేకరించాలని, పెండింగ్‌లో ఉన్న 5444 మంది మిస్సింగ్ సిటిజన్ డేటా, 195 మంది ఎంప్లాయిస్ డేటా, 14141 హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ డేటా, నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ పట్టణ ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈ, పీ-4 తదితర పెండింగ్ సర్వేలన్నీ పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

డ్వామాలో బదిలీలకు రంగం సిద్ధం


నంద్యాల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాపిత బదిలీల్లో భాగంగా నంద్యాల్య జిల్లా డ్వామాలో అర్హులైన అభ్యర్థుల సంఖ్యను కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు...నంద్యాల జిల్లా డ్వామాలో ఆరు విభాగాల్లో పని చేసే అర్హులైన 201 మంది అభ్యర్థుల చిట్టా తయారైంది. వీరిలో డీఎఫ్‌టీలు-18, కంప్యూటర్ ఆపరేటర్లు- 45, ఈసీలు -20, టీఏలు- 80, ఏపీఓలు- 26, సీఎల్ఆర్‌పీలు- 3 ఉన్నారు. అర్హులైన అభ్యర్థుల పనితీరును బట్టి వారికి ప్రాధాన్య స్థానాలు కేటాయింపు జరుగుతుంది. బదిలీలు ఈ నెల 21న ప్రారంభమై 26న ముగుస్తాయి. ఉత్తర్వులు పొందిన వారు ఈ నెల 29న తమకు కేటాయించిన స్థానాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు అధికారులు బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు.

వైభవోపేతం.. తెప్పోత్సవం

కోనేరులో తెప్పపై విహరించిన ప్రహ్లాద వరదుడు


అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : అహోబిల లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు అనంతరం దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరద స్వామి తెప్పోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో వివిధ వాహనాల్లో విహరించి అలిసిసొలిసిన స్వామి, అమ్మవార్లు తెప్పపై కొలువై ఏకాంతంగా సేదతీరుతున్నారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పర్యవేక్షణలో ఈ తెప్పోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సోమవారం శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా కోనేటి వరకు తీసుకొచ్చారు. శ్రీవారు ఉభయదేవేరులతో తెప్పలో ఏకాంతంగా విహరించారు.


ఉభయ దేవేరులతో కలిసి తెప్పపై విహరిస్తున్న దేవదేవుడు

బెంగళూరుకు చెందిన ఆనంద్, నందిని దంపతులు ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ప్రహ్లాద వరదస్వామి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు.

నయనానందకరం..
లక్ష్మీమాధవుల పరిణయం

- కల్యాణోత్సవానికి పోటెత్తిన భక్తులు
- గరుడ వాహనంపై ఊరేగిన ఆది దంపతులు


గరుడవాహన సేవకు హాజరైన భక్తులు

కోడుమూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం వేకువ జామున స్వామిఅమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా సాగింది. అర్ధరాత్రి ఎర్రగుడి వాసులు వరుడు మాధవుడి తరపున ప్రభను తీసుకొని హంద్రీ నది మీదుగా గోరంట్ల చేరుకున్నారు. ఆ వెంటనే వధువు లక్ష్మీదేవికి పెద్దలు గోరంట్ల వాసులతో తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం ఇరు గ్రామాల ప్రజలు ఉత్సవమూర్తులను కల్యాణకట్ట చేర్చారు. దీంతో వేదపండితుడు వందవాసి రాధాక్రిష్ణ అధ్వర్యంలో పురోహితులు మంత్రాలు పఠిస్తూ లక్ష్మీమాధవులకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవ కార్యక్రమంలో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం విద్యుద్దీపాల కాంతులతో దేదీప్యంగా ఉండడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ బాలక్రిష్ణ, టీడీపీ నాయకులు తిరుమలనాయుడు, కున్నూరు మధుసూదన్‌నాయుడు, చెరుకులపాడు దుబ్బన్న, కున్నూరు పరమేశ్వరనాయుడు, ఎస్ఐ శ్రీనివాసులు, ఈవో గుర్రెడ్డి, పూజారులు రమణ, వెంకట్రామయ్య, రాజేష్, పురుషోత్తం, గోపి, భరత్, హరి, రంగస్వామి ఆలయ సిబ్బంది మురళి పాల్గొన్నారు.

● అవాంతరాల నడుమ గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో స్వామిఅమ్మవార్ల కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులకు గరుడ వాహనసేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కల్యాణమూర్తులను మేళతాళాల మధ్య ఆలయం వెలుపలికి తోడ్కొని వచ్చి గరుడ వాహనం కొలువుంచారు. అనంతరం అర్చకుల పూజలు నిర్వహించారు. గరుడ వాహనానికి ముందు భాగంలో వరుడి తరపు ఎర్రగుడి వాసులు, వెనుక భాగంలో అమ్మవారి తరపు గోరంట్ల వాసులు ఉంటారు. ముందుకు లాగే ప్రయత్నాన్ని వెనుక భాగంలో ఉన్నవారు నిలువరిస్తారు. ఈ సమయంలో ఇరువైపులా బలప్రదర్శన చూపి కేరింతలు, ఈలలతో హోరెత్తిస్తారు. గరుడ వాహన సేవలో యువకులు అధికంగా పాల్గొనడంతో ఉత్సాహం ప్రదర్శించారు. అయితే ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే వెనుక భాగంలో కట్టిన టెంకాయ తాళ్లు తెగడంతో ముందుకు దూసుకెళ్లి బ్యాలెన్స్ తప్పింది. ఘటనలో ఎర్రగుడికి ఓ వ్యక్తికి ఇరుసు చీల కోసుకోవడంతో కాలికి గాయమైంది. దీంతో వాహన సేవకు అంతరాయం ఏర్పడింది. యువకుడిని స్థానికంగా ఆసుపత్రిలో చికిత్స చేయించగా ఐదు కుట్లు పడ్డాయి. సుమారు అరగంట తర్వాత గరుడ వాహన సేవ కొనసాగింది.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


వేడుకను తిలకిస్తున్న భక్తులు


కల్యాణమూర్తులకు గరుడ వాహన సేవ

అక్కదేవతలకు 16నాళ్ల పండుగ

ఉయ్యాలవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెమ్మ గుడి వద్ద అక్కదేవతలకు 16నాళ్ల పండుగను ఘనంగా చేశారు. పూజారి ఓబులేసు ఆధ్వర్యంలో అక్కదేవతలకు పట్టు వస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు.


అక్కదేవతలకు పూజ చేస్తున్న పూజారి ఓబులేసు

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ

శ్రీశైలం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

కమనీయం.. రంగనాథుని కల్యాణోత్సవం

- అంగరంగ వైభవంగా రథోత్సవం


స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కమనీయంగా కళ్యాణోత్సవం జరిగింది. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు చిత్తా నక్షత్రమున రంగనాథస్వామి, భూదేవి శ్రీదేవి కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగనాథ స్వామికి నూతన వస్త్రాలను దివంగత పారా రామన్న కుమారులు పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న), పారా జయవర్ధన్ సమర్పించగా.. కంసలి బ్రహ్మయ్య, మంగళసూత్రం సమర్పించగా.. పురోహితులు స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని నిర్వహించారు. సాయంకాలం రథోత్సవం జరిపారు. ఈ ఉత్సవాన్ని తహసీల్దార్ హుశేన్‌సాబ్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


భక్తుల మధ్య రంగనాథ స్వామి రథోత్సవం

బాధితులకు న్యాయం చేస్తాం

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ
- ప్రజల నుంచి 115 ఫిర్యాదులు

కర్నూలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి.

- నిందితులను విచారించి బాధితులకు న్యాయం చేయాలని కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సిద్ధయ్య ఫిర్యాదు చేశారు. కర్నూలు ఫుడ్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో కర్నూలు చెందిన జహీర్ బాషా, ఆయేషా భాను, జాకీర్ బాషా అరెస్ట్ అయ్యి.. కండీషన్ బెయిల్‌పై విడుదలయ్యారని చెప్పారు.
- తనకు తెలియకుండా తన కుమారుడు పెద్ద మద్దిలేటి, మనుమడు మధు కలిసి తన పొలాన్ని వారి పేరు మీద ఆన్‌లైన్ అడంగల్ చేసుకున్నారని, న్యాయం చేయాలని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన కె.వెంకన్న ఫిర్యాదు చేశారు.
- డీఆర్‌డీఏ వెలుగు డిపార్టుమెంటులో పని చేస్తున్న వెంకటరత్నం సీసీ స్కీముల పేరు చెప్పి ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పి, డబ్బులు తీసుకుని మోసం చేశారని హాలహర్వికి చెందిన శీలం నాగమ్మ ఫిర్యాదు చేశారు.
- అదనపు కట్నం తీసుకురావాలని అత్తమామ, బావలు వేధిస్తున్నారని పత్తికొండ పట్టణానికి చెందిన వి.రమాదేవి ఫిర్యాదు చేశారు.
- పెంచికలపాడు దగ్గర ఉన్న తమ పెద్దల స్థలానికి తన సోదరుడు అనిల్ కుమార్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రాజశేఖర్‌పై రిజిస్ట్రేషన్ చేశారని, సహకరించిన ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలని కర్నూలు విఠల్‌నగర్‌కు చెందిన రేణుక ఫిర్యాదు చేశారు.
- చీటీ డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న జోహరాపురం గ్రామానికి చెందిన మహమ్మద్‌పై చర్యలు తీసుకోవాలని కర్నూలు ఇందిరమ్మ గృహాల ఏరియాకు చెందిన చాకలి రామచంద్రుడు ఫిర్యాదు చేశారు.
- మాదేవి కుటుంబ సభ్యులు డ్రైనేజీ కాలువలో నీటి పోయకూడదని కాలువలో మట్టి, రాళ్లు వేసి ఇంటి దగ్గర గొడవ చేశారని, పొలానికి వెళ్లేటప్పుడు దారి లేదని దాడి చేస్తున్నారని క్రిష్ణగిరి మండలం కటారికొండ గ్రామానికి చెందిన సరోజ ఫిర్యాదు చేశారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

కర్నూలు లీగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు తమ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది తెలిపారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాల న్యాయవాదులకు, ఎన్జీవోలకు నిర్వహించిన మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర హైకోర్టు అన్ని జిల్లా కోర్టులలో మధ్యవర్తిత్వాన్ని ప్రవేశపెట్టాలని ఆదేశించిందని, ఈ మేరకు సోమవారం నుంచి 21వ తేదీ వరకు ఈ అంశంపై 40 గంటల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించేందుకు కేరళ రాష్ట్రం నుంచి శిక్షకులు వచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద మధ్యవర్తిత్వానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు.

నేడు గ్రేడ్-3 ఏఎన్ఎంలకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో 175 ఖాళీలకు ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఎంపీహెచ్ఏ (ఫీమేల్)గా పదోన్నతుల కౌన్సెలింగ్ మంగళవారం ఉదయం 11.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ ఓ ప్రకటనలో తెలిపారు. పదోన్నతులు అడిక్వెన్సీ చూసుకుని రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం చేసినట్లు తెలిపారు. వెయిటేజ్ మార్కులు కలిపేది డీఎంహెచ్‌వో పరిధిలో ఉండదని, మెరిట్ లిస్టు స్టేట్ నుంచి వస్తుందని, వెయిటేజీ మార్కులు మూడు విడతల్లో పంపినట్లు తెలిపారు. వెయిటేజీ మార్కులు కలవని, ఏఎన్ఎం-2019లోనే స్టేట్‌కి సర్వీసు సర్టిఫికేట్‌ని పెట్టుకున్నారని, అప్పుడు మార్కులను కలిపి రివైజ్డ్ మెరిట్ లిస్టు వచ్చినట్లు చెప్పారు. అర్హుల జాబితా, ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు సర్వీసు రిజిస్టర్, ప్రయారిటీ సర్టిఫికెట్లు తీసుకురావాలని చెప్పారు.

'కొన్ని ఖాళీలను తగ్గించారు'

ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల ఖాళీలను 215 నుంచి 175 తగ్గించారని, దీని వల్ల ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు. పదోన్నతుల కౌన్సిలింగ్ కమిటీలో కలెక్టర్ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. రోస్టర్‌కు సంబంధించిన ఎస్సీ కేటగిరీకి రావాల్సిన పోస్టులు తక్కువ చూపించాలని కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై వైద్యఆరోగ్య శాఖ అధికారులు మాత్రం ప్రొజిషియన్ ఐడీ లేనందువల్ల కొన్ని పెండింగ్‌లో పెట్టామని, ఎస్సీ లు ఉన్నదానికంటే ఎక్కువగా ఉండటం వల్ల జనరల్ సీనియారిటీ ప్రకారం జనరల్ కేటగిరి ప్రకారం పదోన్నతులు కల్పిస్తామన్నారు. ఇక్కడ ఎవరికీ అన్యాయం జరగదని, పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు.

రాక్షసుడిని రాష్ట్రంలోకి రానివ్వకండి

- సాక్షులను హత్య చేస్తున్న అవినాష్
- టీడీపీ నాయకులను చంపిస్తున్న పెద్దిరెడ్డి
- కుడా చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లిని కూడా ఇంటి నుంచి గెంటి వేసి కేసులు పెట్టిన జగన్మోహన్ రెడ్డి లాంటి రాక్షసుడిని రాష్ట్రంలోకి రానివ్వకండని ప్రజలను కుడా చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్ రాష్ట్రంలోని వనరుల ద్వారా వేల కోట్ల రూపాయలు దోచేశారని ఆరోపించారు. బాబాయి వివేకానంద రెడ్డిని చంపిన అవినాష్‌రెడ్డి అరెస్టు కాకుండా కాపాడుతున్న జగన్‌కు సిగ్గు ఉందా? అని ప్రశ్నించారు. మరో వైపు చిత్తూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలను అతికిరాతకంగా చంపిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంటనే అరెస్టు చేసి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్రంలోని అటవీ భూములను కబ్జా చేసికోట్లు గడించారని, అడ్డువచ్చిన తెలుగుదేశం పార్టీ వారిని హత్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసు యంత్రాంగం అంటే భయపడేలా వైసీపీ నాయకులకు చేస్తే తప్ప టీడీపీ నాయకులు, కార్యకర్తలను చిత్తూరు జిల్లాలో కాపాడుకోలేని పరిస్థితి ఉందన్నారు.

ఆదోనిలో చందన షాపింగ్ మాల్ ప్రారంభం

- హాజరైన సినీ నటి రీతు వర్మ


షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ తదితరులు

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో చందన షాపింగ్ మాల్‌ను సినీ నటి రీతువర్మ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ హేమలత, టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ శాంత హాజరయ్యారు. ముందుగా రీతువర్మ చందన బ్రదర్స్ షోరూంకు రాగానే యువకులు కేరింతలు కొట్టారు. అనంతరం షోరూంలో ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు. షాపింగ్ మాల్‌లో బంగారు ఆభరణాలు ధరించారు. ఈ సందర్భంగా రీతు వర్మ విలేకరులతో మాట్లాడుతూ ఆదోనిలో ఇంత పెద్ద షాపింగ్ మాల్‌కి తాను ముఖ్యఅతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ వినియోగదారులకు 99 రూపాయల నుండే వస్త్రాలు దొరుకుతాయన్నారు. ఆకర్షణీయంగా సరికొత్త డిజైన్లతో జ్యూవెలరీ లభ్యమవుతుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు వన్ టౌన్ సీఐ శ్రీరాం, ట్రాఫిక్ సీఐ గంట సుబ్బారావు ప్రత్యేక చొరవ తీసుకుని తమ సిబ్బందితో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.


సినీ తారను చూసేందుకు వచ్చిన జనం

దద్దనాల ప్రాజెక్టుకు గండి

ఎత్తిపోతల ద్వారా ఆపివేసిన పంపింగ్

అక్రమ మైనింగ్‌ను పట్టించుకోని అధికారులు



ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని జోలాపురం గ్రామం వద్ద సుద్దను కొందరు అక్రమార్కులు అక్రమంగా తవ్వుతుండడంతో దద్దనాల ఎత్తిపోతల పథకానికి సంబంధించి పైప్‌లైన్‌కు సోమవారం గండి పడింది. దీంతో వృథాగా నీరు పోవడంతో దద్దనాల ఎత్తిపోతల పథకం పంపింగ్ ఆపివేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎంతో సదుద్దేశంతో సొంత నిధులు రూ.25.75 లక్షలు సొంత నిధులు వెచ్చించి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పంపింగ్ కేంద్రంలో ఉన్న తుప్పుపట్టిన నాలుగు పంపింగ్ మోటార్లకు ఈ మధ్యనే మరమ్మతు చేయించి శివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ ఎస్సార్బీసీ నీటిని ఎత్తిపోతల పథకం పంపింగ్ కేంద్రం నుంచి దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. దీంతో సజావుగా పంపింగ్ చేస్తుండడంతో దద్దనాల ప్రాజెక్టుకు 12 అడుగుల వరకు నీరు చేరింది. అయితే అక్రమ మైనింగ్ వల్ల ఒక్కసారిగా పైప్‌లైన్‌కు గండి పడడంతో పంపింగ్ పనులు ఆపివేశారు. దీంతో దద్దనాలకు ఎత్తిపోతల ద్వారా నీరు నిలిచిపోయింది.

దద్దనాల ప్రాజెక్టుకు నీరు విడుదల: రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మలు ఈనెల 26తేదీన బనగానపల్లె పట్టణ సమీపంలోని దద్దనాల ఎత్తిపోతల పథకం ద్వారా మోటార్‌లుఆన్ చేసి ఎస్సార్బీసీనీటిని జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి పడమటిపల్లెలకు అంకితం చేశారు. ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఉండడంతో మంత్రి బీసీ సొంత నిధులు 25.75లక్షలు వెచ్చించి గత వైసీపీ ప్రభుత్వంలో తుప్పుపట్టిపోయి, పాడై పోయి మూలన పడ్డ నాలుగు మోటార్లుకు 40రోజులు మరమత్తులు చేయించి ఎస్సార్బీసీ కాల్వ ద్వారా ఏర్పాటు చేసిన జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నాలుగు మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేసి ఎన్నికల్లో మంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జుర్రేరు ఎత్తిపోతల పంప్‌హౌస్ వద్ద విలేఖర్లతో మాట్లాడుతూ పడమటి పల్లెలు అయిన సుమారు 28 గ్రామాలకు సాగు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.21 కోట్లతో జుర్రేరు ఎత్తిపోతల పథకాన్ని బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పూర్తి చేశారు. చేయడం జరిగింది .

యథేచ్ఛగా అక్రమ మైనింగ్

మండలంలోని జోలాపురం పరిసర ప్రాంతాల్లో ఓ వైసీపీ నాయకుడు గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు. సుద్దను ఎక్స్‌కవేటర్ బ్లాస్టింగ్‌ల ద్వారా సుద్దను తవ్వి దాన్ని మద్రాస్ తదతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ సుద్దను సబ్బులు, పౌడర్లకు వినియోగిస్తుంటారు. టన్ను సుమారు టన్ను 3వేల రూపాయల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో కూడా కూడా అక్రమ మైనింగ్ చేసి సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇది ఆగలేదు. గతంలో కూడా అక్రమ మైనింగ్ చేస్తుండడంతో దద్దనాల ఎత్తిపోతల పథకానికి గండి పడింది. బీసీ జనార్దన్‌రెడ్డి అప్పట్లో అక్రమ మైనింగ్ తవ్వక



జోలాపురం వద్ద అక్రమంగా జరుగుతున్న మైనింగ్

ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. టీడీపీ ప్రభుత్వంలో కూడా అక్రమ మైనింగ్ ఆగలేదు. అక్రమ మైనింగ్‌తో గండిపడ్డ ఎత్తిపోతల పథకం: ఎంతో సక్రమంగా సాగుతున్న ఎత్తిపోతల పథకానికి జోలాపురంలో అక్రమ మైనింగ్ కొనసాగుతుండడంతో ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు గండి పడి పోయింది. దీంతో నీరు వృథాగా పోయింది. దీంతో ఎత్తిపోతల పథకం పంపింగ్ నిలిచిపోయింది. అక్రమ మైనింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పడమటి ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అక్రమమైనింగ్ జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

గండి పడింది పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

- ఐడీసీ నారాయణరెడ్డి ఏఈ

దద్దనాల ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు గండి పడింది. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఎత్తిపోతల పంపింగ్ పనులు నిలిచిపోయాయి. పైప్‌లైన్ గండి పడడానికి కారకులపై చర్యలు తీసుకుంటాం.

ఉపాధి పనుల్లో భారీ అవినీతి

- చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో భారీ అవినీతి జరిగిందని, వైసీపీ కార్యకర్తలే ఉపాధి కూలీలుగా మారి దోచుకున్నంత దోచేశారని సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి అసెంబ్లీలో గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలనలో ఉపాధి పనులలో జరిగిన అవినీతిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు ఫీల్డ్ అసిస్టెంట్‌గా మారి ఆదాయ వనరులుగా మార్చుకున్నారని అసెంబ్లీలో అన్నారు. ఎక్కడా కూలీలతో పని చేయించకుండా ఎక్స్‌కవేటర్లతో పనులు చేయించి డబ్బులు కాజేశారని అన్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టి అవకతవకలు గుర్తిస్తున్నామన్నారు. 526 మండలాల్లో సోషల్ ఆడిట్ జరిగిందని, 2024-25లో రూ.250 కోట్లు అవినీతి జరిగిందని అన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో తనిఖీలు

- విధుల్లో లేని ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మెమో జారీ



జనరల్ సర్జరీ ఓపీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం ఓపీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాల్టీ, సైక్రియాట్రి సెంటర్, మెడికల్, సర్జరీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ ఓపీ విభాగాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాజువాల్టీలో ఉదయం 9.45 గంటలైనా ఎమర్జెన్సీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సర్జరీ ఓపీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విధుల్లో లేకపోవడంపై సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మెమో జారీ చేసి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగాల్లో ఈ హాస్పిటల్ అమలుపై ఆరా తీశారు. రోగులకు ఎంట్రీ పాస్‌ల గురించి చర్చిస్తున్నామని, త్వరలో అమలయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ హాస్పిటల్ నమోదును పకడ్బందీగా అమలు అయ్యేటట్లు చూడాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో రోగుల రద్దీ దృష్ట్యా అదనంగా మరొక ఓపీ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తనిఖీలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల, డా.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

హైబీపీతో ఉపాధ్యాయురాలు మృతి

కోసిగి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 4వ వార్డులో ఉన్న ఎంపీపీ సీజీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని కవిత హైబీపీతో మృతి చెందారు. ఆమె ప్రస్తుతం 8నెలల గర్భిణి. ఆదివారం రాత్రి పురిటినొప్పులు రావడంతో సొంత గ్రామమైన పాములపాడు సమీపంలోని బుక్కపల్లి గ్రామం నుంచి ఆత్మకూరుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ హైబీపీతో మృతి చెందినట్లు సీజీ పాఠశాల హెచ్‌ఎం సుబ్బలక్ష్మి తెలిపారు. ఎంఈవోలు మొయినుద్దీన్, శోభారాణి మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన ఉపాధ్యాయిని కవిత మెటర్నిటీ లీవ్ తీసుకున్నారని చెప్పారు. ఉపాధ్యాయిని మృతి చెందడం బాధాకరమని ఏపీటీఎఫ్ నాయకులు యూనియన్ నాయకులు ఖలీల్ అహ్మద్, రాజమౌళి, రాముడు, ఓబులేసు వెంకటరెడ్డి, తోటి ఉపాధ్యాయులు నరసయ్య, విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

ఏరియా వైద్యశాలకు నిధులు కేటాయించండి

అసెంబ్లీలో మంత్రి బీసీ విజ్ఞప్తి



బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు నిధులు కేటాయించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం శాసనసభలో ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌ను కోరారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కనీస మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని ఆరోగ్యమంత్రిని బీసీ కోరారు. బనగానపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వాస్పత్రులకు నిధులు కేటాయించాలని ఆరోగ్య శాఖామంత్రి దృష్టికి తీసుకుపోయారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం బనగానపల్లె వైద్యశాలకు త్వరిత గతిన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆరోగ్య శాఖ మంత్రిని మంత్రి బీసీ కోరారు.

శరీన్‌నగర్‌లో ముమ్మర తనిఖీలు

కర్నూలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో సోమవారం రాత్రి పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. సంజన్న హత్య కేసు ఘటన తర్వాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఐలు గోపినాథ్, చంద్రశేఖర్ రెడ్డి, ఏఆర్ పార్టీ పోలీసులు ఈ తనిఖీలు చేశారు. పార్కులు, బహిరంగ స్థలాలు, పాఠశాలలు, పార్కుల వద్ద పనిపాట లేకుండా తిరుగుతున్న వారిని హెచ్చరించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

సంజామల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆకుమళ్ల టీడీపీ వర్గీయులు అదే వర్గానికి చెందిన మహేశ్వర రెడ్డి, రమణారెడ్డిపై దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య సోమవారం తెలిపారు. గ్రామ ఆధిపత్యం కోసం వర్గ విబేధాలతో గొడవలకు పాల్పడి ప్రత్యర్థులను గాయాలకు గురి చేసిన తిమ్మయ్య, దుబ్బా రామగోవింద రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మదన గోపాల్, కుళ్లాయిరెడ్డిలను అరెస్ట్ చేసి కోవెలకుంట్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామన్నారు. రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వలస వెళ్లిన రైతు ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసి అప్పుల పాలై కుటుంబంతో వలస వెళ్లి జీవిస్తున్న రైతు లక్ష్మన్న (32) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జొన్నగిరికి చెందిన సూరన్న కుమారుడు లక్ష్మన్న, భార్య పిల్లలతో రైల్వేకోడూరుకు వలస వెళ్లి బేల్దార్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దొంగల నుంచి కాపాడండి

పోలీసులకు గోవర్ధనగిరి మామిడి రైతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

వెల్దుర్తి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మామిడి పొలాల్లో దొంగలు పడి కాయలను దోచుకెళ్తున్నారని గోవర్ధనగిరి రైతులు కోరారు. సోమవారం మామిడి రైతులు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసు అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నారు. గోవర్ధనగిరి గ్రామం చుట్టూ వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. గత నెల నుంచి మామిడికాయలు ఒక సైజుకు వచ్చాయి. కొందరు దుండగులు రాత్రి వేళల్లో బైకులపై గ్రామ శివారులోని పొలాలకు చేరుకుని మామిడికాయలను కోసుకుని వెళ్తున్నారు. నెల రోజులుగా గ్రామానికి చెందిన మద్దయ్య, నక్క రాముడు, శివుడు, అయ్యస్వామి రైతుల తోటల్లో ఈ దొంగతనాలు జరిగాయన్నారు. గత రాత్రి రామచంద్రుడు అనే రైతు పొలంలో దొంగలు మామిడి కాయలు కోసుకుని పరారవుతుండటం రైతు గమనించాడు. రామచంద్రుడు వారి వెంట పడి కేకలు వేయగా.. సమీపంలోని వంకలో మామిడి సంచులను వేసి దొంగలు పరారయ్యాడు. దీంతో రైతులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యమిత్ర ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగులు నిరసన బాట పట్టారు. సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 180 మంది వైద్యమిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు సీసీడీఈవో విధులు బహిష్కరించారు. అనంతరం కలెక్ట రేట్ ఎదుట ఎన్టీఆర్ వైద్యమిత్ర అండ్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ యూని యన్ (జేఏసీ) ఆధ్వర్యంలో శాంతియుత దశలవారి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నాగరాజు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కంబగిరి, మనోహర్ మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని, రిటైర్ మెంటు బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషా, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్ర టరీ దేవేంద్ర నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మహ్మద్‌గౌస్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు రవి, సభ్యులు ఇందిర శరణ్య పాల్గొన్నారు.

మృతదేహంతో బంధువుల ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న దృశ్యం

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం నాగలాపురం గ్రామస్థులు వీరేష్ (30) మృతదేహంతో ఆందోళన చేపట్టారు. 2025 మార్చి 13వ తేదీన ఆదోని సమీపంలో ట్రాక్టర్, కారు ఢీకొన్న ప్రమాదంలో కురువ వీరేష్ (30) తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. వీరేష్‌కు భార్య సుజాతతో పాటు ఐదుగురు ఆడబిడ్డలు ఉన్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. ఇంటికి పెద్ద దిక్కున కోల్పోవడంతో ఆ ఇంటిల్లిపాది బతికేది కష్టమని, అలాంటి సమయంలో పిల్లలకు ఏదైనా సహాయం అందించాలంటూ వీరేష్ శవంతో గ్రామస్థులు స్థానిక విముల రేజెన్సీ దగ్గర ఆందోళన చేపట్టారు. అనంతరం నిర్వాహకులు వేముల రెడ్డి వారు కుటుంబ సభ్యులకు ఆర్థికంగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పొగాకు బేళ్లు దగ్ధం : రూ.1.50 లక్షల ఆస్తి నష్టం



కాపులపల్లెలో పొగాకు బేళ్లు దగ్ధమైన దృశ్యం

బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం కాపులపల్లె గ్రామానికి చెందిన నెమలి వెంకట కృష్ణయ్యకు చెందిన పొగాకు బేళ్లు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. ఎవరూలేని సమయంలో మంటలు చెలరేగడంతో గమనించిన గ్రామ ప్రజలు సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వ నీటితో బిందెల ద్వారా మంటలను ఆర్పివేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. గ్రామ సర్పంచ్ తులసిరెడ్డి ప్రమాద ఘటనా స్థలానికి చేరుకొని బాధితున్ని పరామర్శించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. బాధితుడు నెమలి వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ తాను కౌలుకు పొలం తీసుకొని పొగాకు పండించడం జరిగిందన్నారు. కక్షపూరితంగానే పొగాకుకు నిప్పంటించాడని బాధితుడు వాపోయాడు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడు వెంకటకృష్ణయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జొన్నగిరిలో గడ్డివాముకు నిప్పు

తుగ్గలి: గడ్డివాము మంటలకు దగ్ధం కావడంతో రూ.1లక్ష నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి మండలం చిన్న జొన్నగిరిలో వడ్డె తిరుమలేష్ చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలకు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది పత్తికొండ నుంచి వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే గడ్డివాము అంతా దగ్ధమైంది. సర్పంచ్ ఓబులేసు, టీడీపీ నాయకులు రవి యాదవ్, లక్ష్మణ స్వామి, కృష్ణ, బలరాముడు, మల్లి దగ్ధమైన గడ్డివామును పరిశీలించి రైతులను ఓదార్చారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

అత్యాచార నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడిని జైలుకు తీసుకెళ్తున్న పోలీస్

కర్నూలు లీగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళను అత్యాచారం చేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మహిళా కోర్టు న్యాయాధికారి వి. లక్ష్మీరాజ్యం సోమవారం తీర్పు చెప్పారు. 2020 డిసెంబరు 5వ తేదీన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోసిగి గ్రామానికి చెందిన బాధితురాలు తన అన్న ఆరోగ్యం బాగా లేకపోవడంతో సంజామల మండలం పేరుసోముల గ్రామ సమీపంలో చికిత్స ఇప్పించేందుకు వెళ్లింది. 2020 డిసెంబరు 3వ తేదీన అక్కడ బాధితురాలు నిద్రిస్తుండగా.. తన అన్న కనపడకపోవడంతో వెతకడానికి వెళ్లింది. పేరుసోముల గ్రామం చౌడేశ్వరి గుడి సమీపంలో బాధితురాలు వెళ్తుండగా.. మోటారు సైకిల్‌పై వచ్చిన నిందితుడు హరిక్రిష్ణ మీ అన్నను దగ్గరలో చూశానని, మాయమాటలు చెప్పి ఆ మహిళను తన వాహనంలో ఎక్కించు కుని వెళ్లి అత్యాచారం చేశాడు. తాను పోలీసులనని, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తుపాకితో కాల్చివేస్తానని బెదిరించాడు. ఈ విషయం మీద కొడుకుతో కలిసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడు నాగహరిక్రిష్ణపై కేసు నమోదు చేసి కర్నూలు ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధితురాలికి నష్టపరిహారాన్ని చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను న్యాయాధికారి ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ఎస్. నరేంద్రనాథ్ రెడ్డి వాదించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ప్రారంభమైన పది పరీక్షలు

- మొదటి రోజు ప్రశాంతం
- పర్యవేక్షించిన అధికారులు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు సమయానికి కేంద్రానికి చేరుకున్నారు. అయితే కొన్ని కేంద్రాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



సున్నిపెంటలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఆత్మకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో ఆయా పరీక్షల్లో సోమవారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 28 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 1309 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1281 మంది విద్యార్థులు హాజరయ్యారు.

బండిఆత్మకూరు: మండలంలో మూడు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. 534 మంది విద్యార్థులకు గానూ 11 మంది గైర్హాజరయ్యారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలో సోమవారం జరిగిన పదోతరగతి పరీక్షలకు ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో బ్రహ్మం నాయక్ తెలిపారు. మొత్తం మూడు కేంద్రాలలో 693 మంది విద్యార్థులకు గాను 676 మంది హాజరైనట్లు తెలిపారు.

మహానంది: మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 600 మంది విద్యార్థులకు గానూ 15 మంది గైర్హాజరయ్యారు.

పాణ్యం: మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1185 మంది విద్యార్థులకు గానూ 26 మంది గైర్హాజరయ్యారు.

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్: మండలంలో మొత్తం 7 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 1,349 మంది విద్యార్థులు గానూ 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మిడుతూరు: మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 446 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో శ్రీనాథ్ తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. 266 మంది విద్యార్థులకు గానూ పదిమంది గైర్హాజరయ్యారు.

పగిడ్యాల: మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 423 మంది విద్యార్థులకు గానూ 12 మంది గైర్హాజరయ్యారు.

జూపాడుబంగ్లా: మండలంలో కేంద్రం జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ఆదర్శపాఠశాల కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 430 మంది విద్యార్థులకు గానూ ముగ్గురు గైర్హాజరయ్యారు.

సున్నిపెంట: శ్రీశైలం మండలంలో మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. 622 మంది విద్యార్థులకు గానూ ఐదుగురు గైర్హాజరయ్యారు.

వహీద్‌బాషా.. ఓ విషాదగాథ

వెలుగోడు: ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న వహీద్‌బాషాకు పదో తరగతి పరీక్షలు అగ్ని పరీక్షగా మారాయి. అచేతనంగా ఉన్న ఆ విద్యార్థి ఎలాగైన పది పాస్ కావాలన్న సంకల్పంతో అధికారులను వేడుకొన్నాడు. చివరకు ఉన్నతాధికారుల ప్రత్యేక అనుమతి పొంది మరో విద్యార్థి ఆధారంతో మొదటిరోజు పరీక్షను ఇబ్బందులు పడుతూనే పూర్తి చేసుకున్నాడు. వివరాలివీ.. వెలుగోడు పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వాహీద్‌బాషా ఆడుకుంటూ కిందపడి అనారోగ్యానికి గురయ్యాడు. తల్లితండ్రులు దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి వైద్యం అందిస్తున్నారు. అయినప్పటికీ ఆ విద్యార్థి నేటికీ మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో పది పూర్తి చేయాలని పట్టుబట్టి ప్రత్యేక అనుమతి తెచ్చుకున్నాడు. తండ్రి సహకారంతో పరీక్ష కేంద్రానికి వెళ్లి మరో విద్యార్థి సహకారంతో పరీక్ష పూర్తి చేశాడు. అయితే డిపాల్‌స్కూల్‌లో రెండో అంతస్తులో ఉన్న గదికి తరలించడానికి తండ్రి పడిన కష్టాలు వర్ణనాతీతం. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని గది కేటాయించి పరీక్ష రాయిస్తే బాగుంటుందని పలువురు కోరారు. గతంలో ఈ విద్యా అనారోగ్యం విషయంపై గతంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.



పరీక్ష కేంద్రంలోకి వహీద్‌బాషాను ఎత్తుకెళ్తున్న తండ్రి

తల్లిదండ్రుల ఆందోళన

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీజీ హైస్కూల్ సెంటర్‌లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తరగతి గదిలో ఫ్యాన్‌లు లేవని, బల్లలు సరిగా లేవని డీఈవో జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో. వెంటనే అక్కడకు చేరుకున్న డీఈవో జనార్దన్‌రెడ్డి అదే సెంటర్‌లో పక్కనే అన్ని వసతులతో ఉన్న గదులను పరిశీలించి తరువాత నిర్వహించే పరీక్షకు అక్కడకు మారుస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అంగీకరించి వెనుదిరిగారు. అలాగే నంద్యాల బైర్మల్‌వీధిలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఒకే హాల్‌ను రెండుగా విభజిస్తూ ఇద్దరు ఇన్విజిలేటర్‌లతో పరీక్షను నిర్వహించడం విశేషం.

కొలనుభారతి క్షేత్రంలో భక్తుల సందడి



చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న పురోహితుడు

కొత్తపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నల్లమల్లలో కొలువైన కొలనుభారతి సరస్వతి అమ్మవారి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతో క్షేత్ర ప్రాంగణం కళకళ లాడింది. ప్రాతకాల సమయంలోనే ఆలయ పురోహితులు చారుగోషిణీ నదీజలాలతో అభిషేకించి విశేష పూజాదిక్రతవులు చేసిన అనంతరం అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు తమ చిన్నరులకు పురోహితులచే శాస్త్రోత్తంగా అక్షరాభ్యాస బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు. విచ్చేసిన భక్తాదులకు స్థానిక ఆర్యవైశ్య సత్రం కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వహకులు అన్నదానం చేపట్టారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే, ఈవో

ఆత్మకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఇటీవల జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా పూర్తికావడంతో పట్ల సోమవారం అసెంబ్లీలో సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవస్థానం ఈవో శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదంతో పాటు కంకణాలు, రుద్రాక్షలు, పాగాలంకరణ వస్త్రం, స్వామివారి శేషవస్త్రం తదితర సామగ్రిని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించడం వల్లే శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా పూర్తికావడం పట్ల ఎమ్మెల్యే బుడ్డా సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ అధికారి రాకేష్‌కుమార్‌కు మల్లన్న ప్రసాదాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు-దోర్నాల, నల్లకాల్వ - వెలు గోడు రహదారుల విస్తరణ, మరమ్మతుల గురించి ఆయనతో చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సహాయ కమిషనర్ వెంకటదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యాక్రమానికి ఒక దరఖాస్తు మాత్రమే వచ్చింది. సహాయ కమిషనర్ సంబంధిత శాఖ సిబ్బందిని పిలిచి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

ముస్లింలకు ఇఫ్తార్



ముస్లింలకు ఇఫ్తార్ ఇస్తున్న శ్రీనివాసరెడ్డి

గడివేముల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో కరస్పాండెంట్ రామేశ్వరరావు సోమవారం ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, రాజరాజేశ్వరి హైస్కూల్ ఏవో రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గీతాలాపన

శ్రీశైలం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్. మధుమతి బృందంతో భక్తి రంజని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులు గీతాలను ఆలపించారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం విజయవాడ జిల్లా, గుడివాడకు చెందిన జి. వెంకట సత్యనాథ చక్రవర్తి అనే భక్తుడు రూ. 1,01,116 ల విరాళాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

నంద్యాల కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నంద్యాల పట్టణంలోని పది పరీక్షల కేంద్రాల వద్ద విద్యార్థులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు పది పరీక్ష కేంద్రాల వద్ద ఆర్యవైశ్య సంఘం సభ్యుల సహకారంతో పరీక్ష రాసి బయటకు వస్తున్న 300 మంది విద్యార్థులకు ఆయా కేంద్రాల వద్ద మజ్జిగ ప్యాకెట్లను ఆర్యవైశ్య సంఘం సభ్యులు పంపిణీ చేశారు. పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద ప్రతి రోజు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను అందచేస్తామని ఆయన తెలిపారు. కోశాధికారి మామిళ్ళ నాగరాజు,పసుపుల రాజశేఖర్, బింగుమళ్ళ జగదీష్, శేగు ఉపేంద్ర, కూర ప్రసాద్, సందీప్ పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా

నందికొట్కూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిల్లర, వీధి వ్యాపారులు, ప్రజలు వ్యర్థాలను డ్రైనేజీల్లో వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ బేబి హెచ్చరించారు. పట్టణంలోని పలు కాలనీల్లో సోమవారం పారిశుధ్యం, పురపాలక రక్షిత తాగునీటి సరఫరాను మున్సిపల్ కమిషనర్ బేబి పర్యవేక్షించారు. పలు ప్రాంతాల్లో వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా లేకుండా సంబంధిత సిబ్బంది గుర్తించి వాటిని తొలగించాలని ఆమె ఆదేశించారు. పట్టణంలోని చెత్తా చెదారాన్ని కుప్పలు, డ్రైనేజీల్లో వేయొద్దని, పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను సందర్శించి మున్సిపల్ రక్షిత మంచినీటి సరఫరా ద్వారా అందిస్తున్న కొళాయి నీటి స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆమె పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పన్ను వసూళ్లకు ఇంటింటికి అధికారులు

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో నంద్యాల మున్సిపల్ అధికారులు పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవడం కోసం మున్సిపల్ అధికారులు గడప బాట పట్టారు. శనివారం పన్ను వసూళ్ల కార్యక్రమం కోసం 40 మంది వివిధ శాఖల మున్సిపల్ సిబ్బంది 350 మంది సచివాలయ సిబ్బంది, 150 మంది నాన్ పీహెచ్ వర్కర్లు ఉదయం 7 నుంచే దుకాణాలు, గృహాలు తిరిగారు. సహాయ కమిషనర్ వెంకటదాస్ మాట్లాడుతూ ఈ నెల 31 లోపు పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవటానికి కృషి చేస్తున్నామన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 వరకు వీధి వీధికి గడప గడపకు తిరుగుతూ లక్ష్య చేధనకు యత్నిస్తున్నామని తెలిపారు. గృహ, దుకాణాలు, వాణిజ్య సముదాయాల యజమానులు సహకరిస్తుండటం ఆనందం కలిగిస్తోందన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేయాలి

గడివేముల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రీసర్వేను పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ వెంకటరమణ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రైతుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమక్షంలోనే కొలతలు వేయాలన్నారు. రైతుల అభ్యంతరాలను నమోదు చేసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం: ఈవో

మహానంది, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్షేత్ర పరిధిలోని కోనేర్లల్లో పేరుకుపోయిన పాచిని సోమవారం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. అలాగే సైడ్ కాలువలతో పాటు పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. భక్తులు పుణ్య స్నానాలు చేసే రుద్రగుండం కోనేరుతో పాటు రెండవ ప్రాకారంలోని కోనేర్లల్లో పాచిని తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డిని ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆలయం ప్రాంగణంలోని కొన్ని ప్రదేశాల్లో మ్యాట్లను ఏర్పాటు చేశామని చెప్పారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

బండిఆత్మకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో సోమవారం సీపీఎం నాయకులు డేవిడ్, రామచంద్రుడు, సుబ్బరాయుడు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజి సమస్య ఉందని, మైనార్టీలకు తాగు నీటి కొరత ఉందని, ఎ.కోడూరు, బి.కూడూరు గ్రామాల మధ్య పొలాల రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చూడాలని ప్రజలు సీపీఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రత్నమయ్య, ఓబులపతి, వెంకటేశ్వర్లు, మాబు, చంద్రబాబు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సున్నిపెంట సమస్యలు

సున్నిపెంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సున్నిపెంట సమస్యలపై ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ రాజకుమారి వినతి పత్రం అందజేశారు. సున్నిపెంటలో 1964 నుంచి ఉన్న అగ్నిమాపక కేంద్రాన్ని ఉన్నతాధికారుల అనుమతి లేకుండా శ్రీశైలానికి తరలించారని చెప్పారు. సున్నిపెంట, లింగాల గట్టు గ్రామంతో కలిపి సూమారు 30వేల మంది జనాభా ఉందని, ఏదైనా ప్రమాదం జరిగితే 10 కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సి ఉందని చెప్పారు. ఇంతలోపు ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. సున్నిపెంటలో అగ్నిమాపక కేంద్రాన్ని పునరుద్ధించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. అలాగే సున్నిపెంటలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేంచారని వారు చెప్పారు. ఆశీర్వాదం, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

'టీడీపీతోనే అభివృద్ధి'



ట్యాంకును పరిశీలిస్తున్న ఫిరోజ్

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. స్థానిక రాయల్ కాంపౌండ్‌లో నిర్మాణ దశలో ఉన్న వాటర్ ట్యాంకును సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2014లో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంజూరై ట్యాంకు 90 శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకుందన్నారు. అయితే 2019 ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా ఆగిన ట్యాంక్ నిర్మాణాన్ని అధికారంలో ఉన్న వైసీపీ నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట నరసింహ, నరేష్, జార్జ్ ఇసుక చాంద్, విజయకుమారి తదితరులు ఉన్నారు.

- ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎన్ఎండీ ఫిరోజ్ ఆకాంక్షించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు నంద్యాలకు, పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

విద్యుత్ భారం తగ్గించాలి: సీపీఎం

నంద్యాల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నంతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు విస్మరిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో కుదుర్చుకున్న సెకి ఒప్పందాన్ని రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు రద్దు చేయడం సాధ్యం కాదని అసెంబ్లీలో ప్రకటించడాన్ని తప్పుపట్టారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని, కేవలం కంపెనీల కోసమే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 28న జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

'టిడ్కో గృహాలు ఇవ్వాలి'

నంద్యాల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార ప్రజా చైతన్య చివరి రోజు పాదయాత్ర సోమవారం నందమూరినగర్, వైఎస్సార్‌నగర్‌లో చేపట్టారు. టిడ్కో గృహాలను పరిశీలించిన అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ టిడ్కో గృహలను 13 వేల మంది దరఖాస్తు చేసుకోగా ఎనిమిది వేల మందికి మాత్రమే ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, సీనియర్ నాయకులు తోటమద్దులు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మౌలాలి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు బహిరంగ వేలం

నంద్యాల కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఆంజనేయస్వామి, కోదండ రామస్వామి దేవస్థానానికి చెందిన దుకాణంతో పాటు మూలసాగరంలోని రామస్వామి దేవాలయాలకు చెందిన స్థలంలోని రెండు దుకాణాలకు సోమవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు ఆలయ ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. ఉదయం ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలోని ఒక దుకాణంకు వేలం నిర్వహించారు. ఆరుగురు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారని, ఓ వ్యాపారి నెలకు రూ.6 వేల ప్రకారం బాడుగ చెల్లించే విధంగా బహిరంగ వేలంలో హెచ్చు పాట పాడి దక్కించుకున్నట్లు చెప్పారు. అలాగే మూలసాగరం ఆలయంకు చెందిన రామస్వామి దేవాలయానికి చెందిన రెండు దుకాణాలకు సాయంత్రం బహిరంగ వేలం నిర్వహించగా 20 మంది డిపాజిట్ చెల్లించారని చెప్పారు. ఇందులో మొదటి దుకాణం నెలసరి అద్దె రూ.3 వేలు, రెండో దుకాణం రూ.2600కు అధికంగా పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన బహిరంగ వేలం కంటే రూ.13,200 ఆదాయం దేవస్థానానికి అధికంగా వచ్చినట్లు ఈవో చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో చాకలి మధు (38) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ కేశవ తెలిపిన వివరాలివీ.. కొత్తపల్లికి చెందిన చాకలి ఆంజనేయులు కుమారుడైన చాకలి మధు ఆదివారం రాత్రి గ్రామ శివారులోని వేరుశనగ పంటకు కాపలాగా వెళ్తున్నట్లు భార్య అనితకు చెప్పి వెళ్లారు. అయితే సోమవారం ఉదయం చాకలి మధు స్నేహితుడైన పాతకోట వెంకటరమణ అనే వ్యక్తి తన పొలానికి డీజిల్ తీసుకుని వెళ్లి చూడగా.. వేరుశనగ పంటకు కాపలాగా వేసుకున్న మచ్చుపై ఉలుకూ పలుకూ లేని స్థితిలో ఉన్నారు. వెంకటరమణ మధు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మధు భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని గొర్రెల మృతి

మిడుతూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చింతలపల్లి గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అనేవ్యక్తి గొర్రెలను రోడ్డు వెంబడి నడిపించుకుంటూ నందికొట్కూరు గొర్రెల సంతకు తరలిస్తుండగా నందికొట్కూరు నుంచి వస్తున్న లారీ పాలసీతల కేంద్రం వద్ద గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 గొర్రెలు అక్కడికి అక్కడే మృతి చెందాయి. 10 గొర్రెలకు గాయాలు అయనట్లు వెంకట సబ్బయ్య తెలిపారు. రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు సుబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి లారీని అదుపులోకి తీసుకున్నారు.

గుడిసె దగ్ధం

మహానంది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చలమ ఆంజనేయపురం గ్రామంలో వెంకటరాముడు, సరళకు చెందిన గుడిసె దగ్ధమైంది. రెండు రోజుల క్రితం సాయంత్రం ఉన్నట్టుండి గుడిసెలో నుంచి మంటలు వ్యాపించాయని బాధితులు తెలిపారు. దాదాపు రూ. లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

20న వేలం పాటలు

ఆత్మకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 20వ తేదిన వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వారంతపు సంత మార్కెట్, రోజువారి కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఫీజులు, చిన్న కమేలా, పెద్ద కమేలా, చేపలు, చికెన్ అమ్మకాలక సంబంధించి వేలాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాటలు దక్కించుకున్న వారు 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు లీజు కాలం ఉంటుందని తెలిపారు. 20న ఉదయం 10గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ వేలాల్లో పాల్గొనే వారు డిపాజిట్‌ను చెల్లించి స్వాల్వెన్స్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్ అధికారులను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులతో జిల్లా సమగ్రాభివృద్ధిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కులు, కుసుం కార్యక్రమం కింద విద్యుత్ సబ్ స్టేషన్లు, రిలయన్స్ సంస్థవారిచే కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్, స్టార్ హోటళ్లు, ఐటీఐ సంస్థల ఏర్పాటుకు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ స్థలాలను అన్వేషించాలని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్లకు 5నుంచి 10 ఎకరాలు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు 50నుంచి 100ఎకరాల స్థలాలను గుర్తించాలని అన్నారు. నంద్యాల జిల్లాలో రెండు స్టార్ హోటళ్లు రానున్నాయని, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖలకు చెందిన భూములను గుర్తించాలని తెలిపారు. ఐటీఐ కళాశాలల ఏర్పాటుకు 2ఎకరాల భూమిని కేటాయించేలా స్థలాలను అన్వేషించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపునకు చర్యలు

వంద సంవత్సరాల చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాల్టీలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను, జిల్లా అధికారులను ఆదేశించారు. నంద్యాల మున్సిపాల్టీ డంప్‌యార్డులో పేరుకుపోయిన చెత్త తొలగింపుకు అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని సూచించారు. చెత్త తొలగింపుపై ఆర్టీసీ డ్రైవర్లు ప్రజల నుంచి ఎన్నోసార్లు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు రావడం జరిగిందని దీనిపై శ్రద్ధ వహించాలని సూచించారు. కర్నూలులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిష్కరించాలని, గోస్పాడు మండలంలోని పలు గ్రామాల్లో త్రాగునీటి అంశంపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవోలను ఆదేశించారు. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో అనుమతులు లేకుండా నదిలోకి బోట్లు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవోను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద ఉన్న భూముల ఆయకట్టు వివరాలను బోర్డు ఏర్పాటు చేసి ప్రదర్శించాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

చాగలమర్రి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని మదల్లపల్లె లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మకర్తగా లక్ష్మణబాబు ఉపాధ్యక్షులు శివప్రసాద్, మల్లికార్జున, కార్యదర్శి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరబాబు, జాలయ్య, కోశాధికారిగా నాగేంద్రగుప్తతో పాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎంపికైన అధ్యక్షులు లక్ష్మీనారాయణను ఆర్యవైశ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుధ్య కార్మికురాలికి నివాళి

డోన్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు పెద్దక్క అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలిసిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కార్మికురాలి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. ఆయన వెంటన 3వ వార్డు కౌన్సిలర్ పూజారి వెంకటేశ్వ రమ్మ, వంశీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

డోన్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు అన్నారు. సోమవారం ఉడుములపాడులో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కేఈ కృష్ణమూర్తినగర్, సాయిబాబా గుడి వెనుకాల ఉన్న విద్యుత్ స్తంభాలు ఉండటంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏవీ భాస్కర్ రెడ్డి, పి.రామాంజనేయులు, నక్కి హరి, ఉడుములపాడు శాఖ కార్యదర్శి మధు, పులి, ఎర్రమల, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

'కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

డోన్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తకొత్త చదువుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డోన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇమిడి లక్ష్మణసాయి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పర్మిషన్ లేని విద్యాసంస్థలను విద్యాశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారనీ, తక్షణమే అనుమతులు లేని ఆ పాఠశాలకు తాళం వేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలకు కొమ్ముకాస్తున్న విద్యాధికారులపై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్, మనోజ్, వంశీ, మదన్ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

బేతంచెర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్.బుక్కాపురం, కొత్తపలెల గ్రామాల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశల మేరకు ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. వైద్యులు చందు, నాగార్జున ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, టీడీపీ నాయకులు లక్ష్మన్న, మునీశ్వర్ రెడ్డి, చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి

డోన్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ ఆకాంక్షించారు. పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో పదవ తరగతి విద్యార్థులకు హాస్టల్ వార్డెన్ ఎన్.మధు పరీక్ష ప్యాడ్‌లను, సామగ్రిని అందజేశారు.

శిథిలావస్థలో వంతెనలు

- దెబ్బతిన్న రక్షణ గోడలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా మారిన డాఖానాయిని బ్రిడ్జి



కల్వటాల వద్ద రక్షణ గోడలేని వంతెన

కొలిమిగుండ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల వంతెన సమీపంలో ఆర్‌టీసీ బస్సు బోల్తా పడి 16మందికి గాయాలయ్యాయి. వంతెనలు ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో రక్షణ గోడలు దెబ్బతిని అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం అదమరిచినా అంతే సంగతులు అన్నట్లు మారిపోయింది. అనంతపురం, తాడిప్రతి, గుత్తి, బళ్లారి ప్రాంతాల నుంచి కడప, నెల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ప్రతి రోజూ వేల సంఖ్యలో ఈ రహదారి గుండా ప్రయాణం సాగిస్తుంటాయి. అయితే కొలిమిగుండ్ల సమీపంలోని ఢాఖానాయిని బ్రిడ్జితో పాటు, కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగుపై ఉన్న వంతెన, ఇటిక్యాల వద్ద వాగుపై ఉన్న బ్రిడ్జి అత్యంత ప్రమాదకరంగా మారాయి. రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. మరో వైపు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు బ్రిడ్జిలకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు, వాహనచోదకులు కోరుతున్నారు.

నగదు పురస్కారాలు అందజేస్తా

- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు బనగానపల్లె పట్టణమాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆయన బనగానపల్లె పట్టణంలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. తన తల్లిదండ్రులు కీ.శే. బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.50వేలు, మెమొంటో, జిల్లా స్థాయిలో ప్రతిభ సాధించిన విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి మెమొంటో అందజేయనున్నట్లు తెలిపారు. బనగానపల్లె నియోజకర్గంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలు, జిల్లా పరిషత్, ఉర్దూపాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఈ నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేసి పాత మీటర్లను ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశాడు. పట్టణంలో జీవనోపాధి కోసం వెల్డింగ్ దుకాణాలు, ఫ్లోర్‌మిల్స్, చిరు దుకాణాలు, వ్యాపారాలు నిర్వహించుకుంటున్న యజమానులకు స్మార్ట్‌మీటర్ల ద్వారా అధిక బిల్లులు వస్తున్నాయని వారు వాపోయారు. ఈ మేరకు దుకాణదారులతో కలిసి విద్యుత్ శాఖ ఏఈ కృష్ణకు సీపీఎం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హుసేన్‌మియా, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

- **బేతంచెర్ల :** ప్రజలకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లలను మండలంలో బిగించరాదని సీపీఎం మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం విద్యుత్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్లయ్య, సుబ్బరాయుడు రహంతుల్లా, వెంకటరమణ, రాజబాబు, శ్రీను, టింగు, యువరాజు, నరసింహ, వెంకటరమణ, నాగరాజు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయంలో హోమం చేస్తున్న అర్చకులు

దొర్నిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. అర్చకులు హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో ఉన్న తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరడంతో ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహించేవారు. ఇటీవల బీసీ బాలికల వసతి గృహం ఆళ్లగడ్డకు తరలించడంతో ఆ భవనాన్ని మరమ్మతులు చేయించి సోమవారం కొత్త భవనంలోకి మార్చామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్ గోవిందు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉమామహేశ్వర స్వామి పల్లకి సేవ

బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, మహేశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, జోలాపురం తిరుమలయ్యతో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

మాయలూరులో ట్రాక్టర్ అపహరణ

కోవెలకుంట్లలో గుర్తింపు

ఉయ్యాలవాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన జనార్దన్ ట్రాక్టర్‌ను సోమవారం తెల్లవారు జామున ఎత్తుకెళ్లారు. బాధితుడు ఉదయం గమనించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు చేకరించారు. అక్కడి నుండి సీసీ ఫుటేజీలను పరిశీలించిగా కోవెలకుంట్ల వైపు వెళ్లినట్లు గుర్తించి కోవెలకుంట్లలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం కోవెలకుంట్లలోని స్కంద టౌన్ షిప్‌లో ట్రాక్టర్ ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అయితే ట్రాక్టర్ తీసుకెళ్లిన వ్యక్తి మాస్కు ధరించటంతో ఎవరన్నదానిపై విచారణ చేస్తున్నారు.



రుద్రవరం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారి



కొలిమిగుండ్లలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



బనగానపల్లెలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రారంభం

- గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి

కొలిమిగుండ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. అరగంట ముందుగానే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 565మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం వెల్లడించారు. సీఐ రమేష్‌బాబు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాంతో కలిసి, పరిక్షా కేంద్రాలను సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు.

శిరివెళ్ల : మండలంలో శిరివెళ్ల, యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో, శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు సోమవారం పరీక్షలు రాశారు. ఎస్‌ఐ చిన్న పీరయ్య ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రుద్రవరం : రుద్రవరం మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈవో వీరరాఘవయ్య సోమవారం తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు.

ప్యాపిలి: మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 752 విద్యార్థులకు గాను 736 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

బనగానపల్లె: మండలంలో మొత్తం తొమ్మిది కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసినట్లు విద్యాధికారి స్వరూప తెలిపారు. తొలిరోజు మొత్తం 1420 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు.

అవుకు : పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో పదవతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయినట్లు ఎంఈవో - 2 వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మొత్తంగా 259మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఏడుమంది గైర్హాజరయ్యారు.

చాగలమర్రి: మండల కేంద్రంలోని ఆయా కేంద్రాల్లో 760 మంది విద్యార్థులకు గాను 743 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కేంద్రాలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల పరిశీలించారు.

బేతంచెర్ల : బేతంచెర్ల పట్టణంలో మొత్తంగా 1095 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 1077 మంది విద్యార్థులు హాజరు కాగా, 18 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో సోమశేఖర్ తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

సంజామల: మండలంలో ఏడుగురు విద్యార్థులు గైర్హా జరైనట్లు ఎంఈవోలు రాజయ్య, ఈశ్వరయ్య సోమవారం తెలి పారు. డిపార్ట్‌మెంట్ చీఫ్‌లుగా రామచంద్రా రెడ్డి, సుదర్శన్ రావు, నారాయణరావు, డిపార్ట్‌మెంట్ అధికారులుగా పుల్లయ్య ఆచారి, శంకరయ్య హుసేనయ్య వ్యవహరిస్తున్నారు.

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించిన పది పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ అధికారి నరసింహుడు తెలిపారు. సోమవారం ఆదర్శ పాఠశాలలో 241 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దొర్నిపాడు: మండలంలో నిర్వహించిన పది పరీక్షల్లో మొత్తం 180మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.



బనగానపల్లెలో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

- ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి



చాగలమర్రి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులలో పోషకాహార లోపం లేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి అన్నారు. చిన్నారులు మానసిక, శారీరక పెరుగుదల, ఆటలాడుకునేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని సీడీపీవో ఆంధ్రజ్యోతితో అన్నారు.

ప్రశ్న: ప్రాజెక్టు పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

జవాబు: ప్రాజెక్టు పరిధిలో ఆరు మండలాలు (ఆళ్లగడ్డ, రుద్రవరం, శిరివెళ్ల, చాగలమర్రి, దొర్నిపాడు, ఉయ్యాలవాడ) ఉన్నాయి. మొత్తంగా 309 కేంద్రాలు, తొమ్మిది మినీ కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న: ఎంతమంది సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు ఉన్నారు?

జవాబు: ఎనిమిది మంది సూపర్‌వైజర్లు, 309 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

ప్రశ్న: 0-3 సంవత్సరాల లోపు చిన్నారులు ఎంత మంది ఉన్నారు?

జవాబు: 0-3 సంవత్సరాల లోపు 2,08,742, 3-6 లోపు పిల్లలు 1,03,486, బాలికలు 36,749 మంది, గర్భిణులు 40,257 మంది ఉన్నారు.

ప్రశ్న: పోషన్‌వాటికలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలో 235 పోషన్ వాటికలు ఉన్నాయి.

రికార్డుల ఆడిట్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగన్న ఆధ్వర్యంలో సోమవారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో కళాశాలలో నిర్వహించిన పలురకాల రికార్డులను ఆడిట్ అధికారులు జాన్సీరాణి, జనార్దనుడు క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీరు నిలిపివేత

రుద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వెలిగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీటి సరఫరాను నిలిపివేసినట్లు గంగ అధికారులు సోమవారం తెలిపారు. వారబందీ ప్రకారం గంగకాల్వకు నీటి విడుదల కొనసాగిస్తున్నామన్నారు. తాగునీటి సరఫరాకు నిల్వ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. మళ్లీ విడత విడుదల చేసేదీ లేనిదీ ఉన్నతాధికారుల ఆదేశాలను బట్టి ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయాశాఖల అధికారులు జిల్లా కలెక్టర్‌చే నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యల్లావత్తులలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు

రుద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లావత్తుల గ్రామంలో తాగునీటి పైపులైను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సర్పంచ్ చంద్రమోహన్‌ను తాగునీటి విషయంపై విన్నవించారు. సర్పంచ్ సూచనల మేరకు 300 మీటర్లు పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించినట్లు ఏఈ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. సోమవారం గొడిగనూరు గ్రామంలో ఎఫ్‌డీపీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, సుబ్బరా యుడు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి

చాగలమర్రి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పని భారం తగ్గించాలంటూ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తిరునాంపల్లెలో సర్వే పరిశీలన

డోన్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం తిరునాంపల్లె గ్రామంలో ఆరార్‌బీఎస్, ఎన్‌సీడీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతరావు నాయక్, బీపీ షుగర్ కేసుల సర్వేను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇచ్చిన సర్వే లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని హెల్త్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కొత్త బురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ కే.చంద్రశేఖర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ

ప్యాపిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జామియా మసీదులో సోమవారం పేద ముస్లింలకు చీరలు, నగదు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్, జాకీర్ సౌజన్యంతో ముస్లిం పెద్దలు వీటిని అందజేశారు. కార్యక్రమంలో మస్తాన్‌ఖాన్, మహబూబ్‌సాహెబ్, ఖాజాపీర్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు

ముగిసిన పంచాయతీ వేలం

ప్యాపిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజరు గ్రామ పంచాయతీ వేలాలు సోమవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. వారపు సంత, బస్టాండ్, డైయిలీ మార్కెట్, కబేళాకు సంబంధించి సర్కారు వారి పాటగా రూ.9.9లక్షలు నిర్ణయించారు. ఈ వేలాల్లో ఐదు మంది పాటదారులు పాల్గొనగా అందులో పట్టణానికి చెందిన నాగేంద్ర రూ.11.48 లక్షలకు దక్కించుకున్నారు. ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, సర్పంచు లక్ష్మిదేవి, ఉప సర్పంచు గడ్డం భువనేశ్వరరెడ్డి, పంచాయితీ కార్యదర్శి శివకుమార్ సమక్షంలో ఈ వేలాలు నిర్వహించారు.

మండుటెండలో తిరుమలకు పాదయాత్ర

చాగలమర్రి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం శాతనకోటకు చెందిన 26మంది తిరుమలకు పాద యాత్ర చేపట్టారు. సోమవారం చాగలమర్రిలో మండుటెండలో పాదయాత్ర చేస్తున్న వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. బృంద ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి పాదయాత్ర ప్రారంభించామన్నారు. 23వ తేదీకి తిరుమలకు చేరుకొని వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని పాదయాత్ర ముగిస్తామన్నారు.



యాత్రగా వెళ్తున్న మహిళలు